# పుణ్యభూమి! కళ్ళు తెరు!!

## గోపరాజు రాధాకృష్ణ

"ఈవిడకి కావలసిన మన్మధుడింకా దొరకలేదేమో!"

"ఏమో! ఈవిణ్ణే వెతుక్కుంటూ వస్తాడేమో... ఎవరు చెప్పొచ్చారు?"

"...లేకపోతే ఏదేనా ప్రేమ వ్యవహారం ఉందేమో..."

"రంభ కదా... కో అంటే కోటిమంది క్యూలో వుంటారు!"

...సూటిగా భారతి గుండెల్లో గుచ్చుకున్నాయి అమ్మలక్కల అభిప్రాయాలు.

కొళాయి దగ్గర వాళ్ళ చర్చనీయాంశం భారతి పెళ్ళి. వాళ్ళ వెక్కిరింపుల్ని పట్టించుకోకూడదనే ప్రయత్నంలో విఫలమై, బిందె ఎత్తుకుని బాధగా ఇంటికి బయలుదేరింది భారతి.

చాలా కాలంగా తండ్రి గుండెల మీద కుంపటైన భారతికి ఓ శుభ దినాన వివాహం నిశ్చయమైంది. కాళ్ళరిగేలా తిరిగిన తండ్రికి ఈ నిశ్చితం కొంత సంతోషాన్నిచ్చింది.

ఆ కుటుంబంలో భారతే పెద్ద కూతురు. రెండు నీలవేణి. మూడు లక్ష్మి. ఇద్దరు కొడుకులు. అతి కష్టం మీద సంసార సాగరాన్ని ఈదుకొస్తున్నాడు తండ్రి సూర్యనారాయణ.

మాటల ప్రకారం వెయ్యి నూటపదహార్లు కట్నం గాను, ఇవి గాక ఆడపడుచు కట్నం, వియ్యపురాలి లాంఛనాలూ అదనం. కాళ్ళు కడుగు పళ్ళెం, పానకం బిందెలు వీటితో సహా ఓ మూడు వేలదాకా ఖర్చుం టుంది. అన్నిటికీ ఒప్పుకున్నాడు సూర్యనారాయణ. పెళ్ళినాటికి డబ్బు సమకూర్చలేకపోతామా అనే ధీమాతో అంగీకరించాడు.

లగ్నం పెట్టించేడు.

* * * *

మంగళ వాయిద్యాలు తారాస్థాయిలో మ్రోగుతున్నాయి. పెళ్ళి పీటమీద కన్యాదాతలు సూర్యనారాయణ, భార్య, వధువు భారతి కూర్చుని వున్నారు. పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. సూర్యనారాయణ గుండెల్లో ఆవేదన! ఆందోళన కొట్టొచ్చినట్టు కనిపిస్తోందతని ముఖంలో.

అనుకున్న సమయానికి డబ్బు సమకూడలేదు. పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు పీటలమీద కూర్చున్న తర్వాత ఇదే విషయం వియ్యంకుడితో అన్నాడు.

పెళ్ళి ఆగిపోతుందేమోనన్న బెంగ! కూతురి బతుకు తర్వాత ఏమౌతుందోనన్న భయం!! దాని బతుకు ఎలా తెల్లవారుతుందోనన్న గాబరా!!!

తను ఊహించినదానికి వ్యతిరేకంగా పెళ్ళి నిర్విఘ్నంగా జరిగింది. వియ్యంకుడి దయార్ద్ర హృదయాన్ని అభినందించేడు సూర్యనారాయణ.

వాళ్ళు ఓ షరతు మీద అమ్మాయిని కాపురానికి తీసుకెళ్ళేరు. వీలైనంత త్వరలో డబ్బుని అందజేయమని షరతు.

* * * *

రోజులు కాలగర్భంలో కలుస్తున్నాయి. బరువు తీర్చుకున్న సూర్యనారాయణ బాధ్యత కూడా తీర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నాడు. వియ్యంకుడికి డబ్బుని సకాలంలో అందచేసి కూతురి కాపురంలో ఏ విధమైన అరమరికలు లేకుండా చెయ్యాలనే సూర్యనారాయణ తపన.

### గాలిపాట

అందులో స్వచ్ఛతలేదనీ
స్పష్టత లేదనీ
సంస్పందన లేదనీ
స్వరకల్పన లేదనీ
గాఢత లేదనీ
తెలిసి తెలిసీ, విని విని
అసలు అది రాగరంజితం కాదని ఈ దిగులెందుకుట?
ఒక్కసారి ఎవరూ పెట్టుకోరు కదా అని
అలా అలవోకగా వినిపిగా
ఆ గడ్డిపూలని తల్లో పెట్టుకుంటాను
ఆ గడ్డిపూవులా ఈ గాలిపాటనూ

—శివలెంక రాజేశ్వరీదేవి

ఇంతలో......

పిడుగులాంటి వార్త!

ఎలాంటి వార్తనైతే తాను వినకూడదనుకున్నాడో అదే తన చెవిన పడింది!!

అల్లుడు, వియ్యంకుడు, వియ్యపురాలు, అల్లుడి తమ్ముడు ప్రతి రోజూ కట్నం డబ్బు గురించి భారతిని అడుగుతున్నారట. మొగుడైతే ప్రతి రోజూ కొడుతున్నాడట.

...వార్త విన్న ఒక్క క్షణం స్థాణువయ్యాడు సూర్యనారాయణ. కన్నీరు ఉబుకుతోందతని కళ్ళలోంచి. వార్త తెలిపిన భార్య రాగాలు తీసింది.

** ** **

కాలం గడుస్తున్నకొద్దీ వాళ్ళలో కట్నం డబ్బు గురించి పట్టుదల వీళ్ళలో కూతురి కాపురం గురించి ఆందోళనా ఎల్లల్ని పెంచుకుంటున్నాయి. భారతిని చేస్తున్న హింస రోజు రోజుకీ ఎక్కువౌతోంది.

సూర్యనారాయణ దంపతుల్ని ఈ విషయం తీవ్ర మనస్తాపానికి గురి చేసింది. గుండె చెరువైపోతోంది. కడుపు తరుక్కుపోతోంది.

బీదరికం మీద అసహ్యం పుట్టింది. బీదరికం ఎన్ని సమస్యలకు జన్మ స్థానమో అప్పుడర్థమైంది సూర్యనారాయణకి. పుట్టింటి పరిస్థితి ఇలా వుంటే —

అత్తింట్లో...

"ఏవే! మీ బాబుకి అల్లుడంటే చులకనైపోయాడే! శుద్ధ చవటలాగ జమకట్టాడు. పెళ్ళి రోజున ముట్టచెప్పాల్సిన సొమ్ము ఇప్పటికి... ఇప్పటికీ ఇవ్వలేదు. అసలు ఏంటి మీ నాన్న ఉద్దేశ్యం?" లెదరు బెల్టు చెళ్ళు మంది. ఫలితంగా భారతి వీపుమీద గాయం. మరోసారి చెళ్ళు మన్న ఫలితంగా భుజంమీద గాయం!

మొగుడు చేస్తున్న ఈ అకృత్యాన్ని ఆపాల్సింది పోయి "నువ్వు అడుగు పెట్టింది మొదలు మాకు దరిద్రమే దరిద్రపు ముండా" అత్తగారి ఆశీర్వచనం ఇది. చివరికి మరిది, మామగార్లు కూడా దూషణలు మొదలు పెట్టారు.

ఏడిచిన కొద్దీ కన్నీరు కార్చడం తప్ప భారతి చెయ్యగలిగిందేం లేదా క్షణాన. అటు పుట్టింటికి వెళ్ళలేక, ఇటు అత్తింట్లో బాధల్ని భరించలేని దయనీయమైన పరిస్థితి భారతిది!

వెక్కిళ్ళ మధ్య చెప్పింది భారతి— "మా నాన్న కూడా ప్రయత్నాలు చేస్తూనే వున్నారండీ. త్వరలోనే మీ డబ్బుని మీకు ముట్టచెబుతారండీ" అని. మొగుడు విన్లేదు ... క్రూరంగా కొట్టాడు.

గాయం!

మళ్ళీ కొట్టాడు!!

గాయం!!!

దుర్భాషలాడాడు.

మూర్తీభవించిన సహనం భారతి!

"అసలు కట్నం తేకుండా మా ఇంటి గడప తొక్కొద్దు" అని బైటికి గెంటి తలుపులు వేసాడు భర్త.

ఏం చెయ్యలేని నిస్సహాయతతో పుట్టింటికి బయలుదేరింది భారతి.

రోజులు గడుస్తున్నాయి. భారతి తండ్రి ఇక తమకి డబ్బు ముట్టచెప్పలేడని, భారతి ఇక ఈ ఇంటి గుమ్మం తొక్కడం సాధ్యం కాదని భారతి అత్తింటివాళ్ళు ఓ నిర్ణయానికి వచ్చేరు.

కొడుకుని అడ్డంగా పెట్టుకుని కట్నం రూపంలో డబ్బు గుంజొచ్చు అనే సంకల్పంతో ఉన్న భారతి మామగారు తన కొడుక్కి వేరే పెళ్ళి సంబంధాల కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు.

కట్నం డబ్బు తేలేదని పెళ్ళాన్ని కొట్టి పుట్టింటికి పంపించి చేతులు దులుపుకున్నంత మాత్రాన మూడు ముళ్ళ బంధం తెగిపోతుందా?

అగ్నిహోత్రం చుట్టూ వేసిన ఏడు అడుగులు, వేద మంత్రాల మధ్య వేసిన కొంగుముడి అక్కర్లేదనుకుంటే పోయేవేనా?

పెళ్ళాం బతికే ఉండగా నరకాన్ని చూపించి, మానసికంగా రోజూ చంపుతూ, భౌతికంగా కూడా చచ్చినట్టే జమకట్టి వేరే వివాహానికి ప్రయత్నం చెయ్యడంలో ఆంతర్యమేమిటి?

భారతి కంటి నుంచి వెలువడ్డ ప్రతీ బాధాపూరిత బాష్పం వాళ్ళ నలుగుర్నీ శపించక మానదు......!

భారతి భర్తకి పెళ్ళి కుదిరిందనే వార్త సూర్యనారాయణకి చేరింది. ఎక్కడ, ఎవరితో సంబంధం కుదుర్చుకున్నారో ఆ ఊరు వెళ్ళేడు.

"బాబూ. ఆడపిల్లల తండ్రిని. నా గుండె కోతని అర్థం చేసుకోండి బాబూ... నా కూతురికి అన్యాయం చెయ్యకండి. దాని బతుకులో నిప్పులు పొయ్యకండి బాబూ" వాళ్ళతో విషయాన్ని వివరంగా చెప్పి కంట తడి పెట్టుకున్నాడు సూర్యనారాయణ.

కుదుర్చుకున్న అబ్బాయికి పెళ్లి అయిందని, అందునా ఆ అమ్మాయి బతికే ఉందని, కట్నం తేలేదన్న నెపంతో పుట్టింటికి పంపి ఈ సంబంధం కుదిర్చారనీ— ఈ విషయాలు సూర్యనారాయణ చెప్పిన తర్వాతే సంబంధం కుదుర్చుకున్నవాళ్ళకి తెలిసాయి.

సూర్యనారాయణ అంతర్మథనాన్ని అర్థం చేసుకున్న అవతలి వ్యక్తి భారతి అత్తింటికి ఓ ఉత్తరం రాసేడు — ఈ సంబంధం ఇష్టం లేదంటూ.

*  *  *

పెళ్ళయిన కూతురు కాపురానికి వెళ్ళకుండా తన ఇంట్లోనే ఉంటోందన్న విషయం, దాన్ని వెంటనే అత్తింటికి పంపించాలన్న బాధ్యత గుర్తొస్తున్నాయి సూర్యనారాయణకి భారతిని చూసినపుడల్లా.

గ్రామ పెద్దల దగ్గరికి వెళ్ళి విషయాన్ని చెప్పి బాధని వెళ్ళగక్కుకున్నాడు. నలుగురు గ్రామపెద్దల సమక్షంలో భారతి పుట్టింటివాళ్ళూ, అత్తింటివాళ్ళూ సమావేశమయ్యారు. ఉభయ వర్గాలవారి మాటలూ విన్న తర్వాత పెద్దలు నిర్ణయించేరు, సూర్యనారాయణ కట్నం డబ్బు వడ్డీతో సహా వియ్యంకుడికి చెల్లించడానికీ, భారతిని ఏలుకోడానికీ, కుదుర్చుకున్న వివాహ ఒప్పందం పట్ల విరుద్ధమైంది గనక దాన్ని రద్దు చెయ్యడానికీ మాటలు.



లిఖితపూర్వకంగా జరిగింది. ఉభయ వర్గాల వారూ, సాక్షులూ సంతకాలు చేశారు.

అప్పో సప్పో చేసి ఎలాగైతేనేం మొత్తానికి కట్నం డబ్బుని వడ్డీతో సహా వియ్యంకుడికి అందచేసాడు సూర్యనారాయణ.

భారతిని అత్తింటివాళ్ళు తిరిగి కాపురానికి తీసుకు వెళ్ళారు. గాఢంగా నిట్టూర్చాడు సూర్యనారాయణ.

*  *  *

ఉదయం అంతా పని వత్తిడి వల్ల రాత్రి ఆదమరచి నిద్రపోతోంది భారతి.

టైం పన్నెండు గంటలు కావొస్తోంది.

శరీరం మీద ఏదో పడినట్టు అనిపించి మెలకువ వచ్చింది భారతికి.

తీరా కళ్ళు తెరిచి చూస్తే—

కిర్సనాయిల్ని తన మీదకి పోస్తున్నాడు భర్త. వాలా మటుకు చీరా, ఒళ్ళు తడిసిపోయాయి కిర్సనాయిల్‌తో.

"ఇదేమిటండీ..."

"అదంతే. తిరిగి మా ఇంటికి తగలడింది కాకుండా... కుదిరిన బంగారంలాంటి సంబంధాన్ని చెడగొట్టేవుకదే దౌర్భాగ్యురాలా" అంటూ అగ్గిపెట్టె కోసం లోపలికి వెళ్ళాడు.

మామగారు, అత్తగారు, మరిది — వీళ్ళంతా నిద్రలో మునిగి వున్నారు.

ఒక్క ఉదుటన ఆ ఇంటి నుంచి బైటపడింది భారతి. ఆ ఇల్లు నరకకూపంలా తోచింది భారతికి.

కిర్సనాయిల్‌తో తడిసిన శరీరంతో పుట్టింటికి పరుగు తీసింది భారతి...... ఏడుస్తూ!

నిశ్శబ్ద నిశీథంలో ఏడుపు ప్రతిధ్వనిస్తోంది. కీచురాళ్ళు కూడా గోల చెయ్యడం మానేసాయి... నిరసన తెలుపుతున్నట్టు!

దూరంగా గుడ్లగూబ దాహంగా అరుస్తోంది. రెక్కలు కొట్టుకున్న చప్పుడు భయంకరంగా వినిపిస్తోంది.

చీకటిని చీల్చుకుంటూ పరుగెడుతోంది భారతి... ద్విగుణీకృతమైన దుఃఖంతో!

ఇది ఏ నాగరికతకు ఫలశృతి?

ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి??

ఏ బుద్ధదేవుని జన్మభూమికి గర్వస్మృతి???

0 0 0

శ్రీ యండమూరి వీరేంద్రనాథ్‌కి అంకితం. గోపరాజు నారాయణరావుకి కృతజ్ఞతలు.

—రచయిత